ChimataMusic.com

# కృషివుంటే మనుషులు ఋషులౌతారు..

**చిత్రం: అడవిరాముడు (1977)**

**పాడినవారు: S P బాలు, P సుశీల**

**గీతరచయిత: వేటూరి**

**సంగీతం: K V మహదేవన్**

---

**పల్లవి:**

మనిషై పుట్టినవాడు కారాదు మట్టిబొమ్మా..

పట్టుదలే వుంటే కాగలడు మరో బ్రహ్మ..

కృషివుంటే మనుషులు ఋషులౌతారు..

మహాపురుషులౌతారు..

తరతరాలకు తరగని వెలుగౌతారు..

ఇలవేలుపులౌతారూ..

**చరణం 1:**

అడుగో అతడే వాల్మీకి.. బ్రతుకు వేట అతనికి..

అతిభయంకరుడు యమ కింకరుడు.. అడవి జంతువుల పాలిటి!!

అడుగో అతడే వాల్మీకి!!

పాలపిట్టల జంట వలపు తేనెల పంట పండించుకొని పరవశించి పోయేవేళా..

ఆ పక్షుల జంటకు గురిపెట్టాడు..

ఒక పక్షిని నేల కూల్చాడు..

జంట బాసిన పక్షి కంటపొంగిన గంగ తన కంటిలో పొంగ..

మనసు కరగంగ..

ఆ శోకంలో ఒక శ్లోకం పలికే..

ఆ చీకటి ఎదలో దీపం వెలిగే!!

కరకు బోయడే అంతరించగా.. కవిగా ఆతడు అవతరించగా..

మనిషి అతనిలో మేల్కొన్నాడు.. కడకు మహర్షే ఐనాడు!!

నవరసభరితం రాముని చరితం.. జగతికి ఆతడు పంచిన అమృతం!!

ఆ వాల్మీకి మీవాడూ.. మీలోనే వున్నాడు..

అక్షరమై మీ మనసు వెలిగితే.. మీలోనే వుంటాడు!!

అందుకే..

కృషివుంటే మనుషులు ఋషులౌతారు..

మహాపురుషులౌతారు..

తరతరాలకు తరగని వెలుగౌతారు..

ఇలవేలుపులౌతారూ..

## చరణం 2:

ఏకలవ్యుడంటేనే ఎదురులేని బాణం..

తిరుగులేని దీక్షకి అతడే ప్రాణం..

కులం తక్కువని విద్య నేర్పని గురువు బొమ్మగా మిగిలాడు..

బొమ్మ గురువుగా చేసుకొని బాణవిద్యలో పెరిగాడు!!

హుటాహుటిని ద్రోణుడపుడు తటాలుమని తరలి వచ్చి పక్షపాత బుద్ధితో దక్షిణ ఇమ్మన్నాడు..

ఎదుట నిలిచిన గురుని పదమంటి..

ఏమివ్వ గలవాడననే ఏకలవ్యుడు..

బొటనవేలివ్వమనె కపటి ఆ ద్రోణుడు..

వల్లెయని శిష్యుడు.. చెల్లె ద్రోణుని ముడుపు!!

ఎరుకలవాడు ఐతేనేమి గురికలవాడే మొనగాడు..

వేలునిచ్చి తన విల్లును విడిచి వేలుపుగా ఇల వెలిగాడు..

అందుకే..

కృషివుంటే మనుషులు ఋషులౌతారు..

మహాపురుషులౌతారు..

తరతరాలకు తరగని వెలుగౌతారు..

ఇలవేలుపులౌతారూ..

## చరణం 3:

శబరీ..

ఇంతకాలము వేచినది ఈ పిలుపుకే శబరి..

ఆశ పరుగిడి అడుగు తడబడి రామ పాదము కన్నది..

వంగిపోయిన నడుముతో నగుమోము చూడగలేక అపుడూ..

కనుల నీరిడీ.. ఆ రామ పాదము కడిగినది శబరి..

పదముల ఒరిగినది శబరి!!

ప్రేమ మీరగ రాముడప్పుడు శబరి తల్లి కనులు తుడిచి

కోరి కోరి శబరి కొరికిన దోర పండ్లను ఆరగించే..

ఆమె ఎంగిలి గంగ కన్నా మిన్నగా భావించిన రఘురాముండెంతటి ధన్యుడో..

ఆ శబరి దెంతటి పుణ్యమో!!

ఆమె ఎవ్వరో కాదు సుమా.. ఆడపడుచు మీ జాతికి..

జాతిరత్నములు ఎందరెందరో మీలో కలరీనాటికీ..

అడవిని పుట్టి పెరిగిన కథలే అఖిల భారతికి హారతులు..

నాగరికతలో సాగు చరితలో మీరే మాకు సారథులూ..

అందుకే..

కృషివుంటే మనుషులు ఋషులౌతారు..

మహాపురుషులౌతారు..

తరతరాలకు తరగని వెలుగౌతారు..

ఇలవేలుపులౌతారూ..